ప్రచురణార్థం/ ప్రసారార్థం : విజయవాడ,

తేది : 14 జూన్, 2021.

# ప్రతి గ్రామంలోనూ వ్యాక్సీన్ కేంద్రాలు పెట్టాలి

## వి. శ్రీనివాసరావు డిమాండ్

రాష్ట్రంలో కరోనా వ్యాక్సీన్ కార్యక్రమం చాలా మందకొడిగా సాగుతోందని, గ్రామాలకు సరిగ్గా అందడం లేదని కౌలు రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు విమర్శించారు. రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి ఆన్ లైను సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లోగా ప్రతి గ్రామంలో, వయోజనులందరికీ కరోనా టీకా వేసేలా కార్యక్రమం రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. లేని యెడల మూడోదశలో గ్రామాలు దారుణంగా నష్టపోతాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వ హ్రస్వదృష్టి వల్ల రెండో దశలో గ్రామాలకు విస్తరించి చాలా పెద్ద ఎత్తున నష్టం జరిగిందని, రికార్డు కాని మరణాలు సంఖ్య ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మే ఆఖరు వారంలో జరిగిన దాని కన్నా జూన్ 10వ తేది వరకు వ్యాక్సినేషన్ వేగం తగ్గిందని, దేశంలో వెనుకబడిన రాష్ట్రాల్లో మనదొకటని ఆయనన్నారు. మే 21-31 మధ్య రోజుకి 2. 5 లక్షల డోసులు ఇవ్వగా అది జూన్ 1-10 మధ్య 1. 6 లక్షలకు తగ్గిపోయిందని, ఈ లెక్కన అందరికీ ఇవ్వడానికి ఎన్ని నెలలు పడుతుందో కూడా తెలియదని చెప్పారు. ఇప్పటివరకు కోటి 15 లక్షల మందికి ఒక డోసు మాత్రమే ఇవ్వగా 27 లక్షల మందికి మాత్రమే రెండో డోసు కూడా పూర్తయింది. ఇందులో అత్యధిక భాగం 5 జిల్లాలలో అదీ పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. కేంద్రం నుండి గత పదిహేను రోజుల్లో 7 లక్షల డోసులు మాత్రమే వచ్చాయి. ఈ లోపాన్ని పూడ్చుకొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రోజువారీ వ్యాక్సీన్ డోసులు పెరిగే విధంగా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. లెక్కలు తగ్గినంతమాత్రాన కరోనా తగ్గినట్లు కాదని, గ్రామాల్లో అది ఇంకా తీవ్రంగానే ఉందని, ఇదే పరిస్తితి కొనసాగితే ఇంకా తీవ్రమవుతుందని ఆయన హెచ్చరించారు. కనీసం ప్రతి పంచాయితీలో ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించాలని డిమాండు చేశారు.

సం/-

**(ఆర్. రాఘవేంద్ర)**

ఆఫీసు బాధ్యులు